# మన సంగీతము

భారతీయ సంగీతంలో ముఖ్యంగా రెండు విభాగాలున్నాయి ఒకటి దక్షిణదేశపు బాణీ కర్నాటక సంగీతం, రెండవది ఉత్తరదేశపు బాణీ హిందుస్తానీ సంగీతం ఈ రెండు బాణీలలోనూ ఇంకా ప్రాంతీయ ప్రభావాల వలన ఏర్పడ్డ చిన్న చిన్న శాఖోపశాఖ లున్నా అవి అట్టే చర్చనీయాంశాలు కాదు భారతీయ సంగీతానికంతటికీ మూలాధారములైన గ్రంథాలను పరిశీలించి చూసినా, యీ రెండు సంగీతాలనూ అభ్యసించి అర్థంచేసుకు చూసినా, కొన్ని క్రొత్త భావాలు, నిర్ణయాలూ రూపొందకమానవు

ఒకప్పుడు సంగీతం ఛందోబద్ధంగా వుండేది అంటే మాత్రాగణాలు అమర్చిన పాదాలు గల గీతాలను అలాగే పాడుతూ సంగీతం కన్న సాహిత్యం ప్రధానంగాను, లయ ముఖ్యంగాను గమనిస్తూండేవారు కారణం సంగీతం అనేది విడిగా ఒక కళగాదు నాట్యానికి ఒక అంగం నాట్యం నాటకానికి ఒక అంగం అసలు నాటకమే నాట్యంగా వ్యవహరింపబడింది కూడాను కొన్నాళ్లు ఆ యీ కారణాలచేత లయ ప్రధానంగాను, ఛందస్సులు ఆధారంగాను, గీత రచన జరగడంలో ఆశ్చర్యంలేదు జయదేవుని రచనలు చూడండి! ఆ రోజుల్లో ఆ తాళాలను ఏ పేర్లతోనైనా వ్యవహరించి వుండవచ్చును గాని, మాత్రావిభాగాలనుబట్టి ఇప్పుడు మనం ఏదియే పేరుతో వ్యవహరిస్తున్నామో ఆ తాళాల పేర్లే యిక్కడ పేర్కొనడమైంది

12 345 12 345 12 345 12 3 45
వద । సియది ॥ కిం । చిదపి ॥ దం । తరుచి ॥ కౌ । ముదీ ॥

ఇది జంపె లేక కురుజంపె అని అంటాం మాటలు ఐదేసి మాత్రలు గల విభాగాలుగా విడి, తాళాన్ని ఆధారంచేసుకొని నడుస్తాయి ఇదే గీతాన్ని ఇంకో తాళంలో, ఇంకో లయలో పాడితే రామునితోక పివరుండు లాగ విరుగుతాయి పదాలు ప్రతి పాటకీ ఛందోబద్ధమైన లయి ఏదయితే వుంటుందో అదే లయలో పాడితీరాలి

మంచాళ జగన్నాధరావు

12 3456 ॥ 12 । 3456 ॥ 12 । 3456 ॥ 12 । .. ॥
శ్రిత । కమలా ॥ కుచ । మండల ॥ ధృత । కుండల ॥ ఏ । .. ॥
1234 । 5678 । 1 2 34 । 5678 ॥

ఇది చతురశ్ర రూపకం పశ్యతి । దిశిదిశి । రహసిభ । వంతం ॥ చతురశ్ర ఏకతాళం లోను లేదా ఆదితాళంలోను పాడుకోవచ్చు

123 । 4567 ॥ 123 । 4567 ॥ 123 । 4567 ॥ 123 । 4567 ॥
మామి । యంచలి ॥ తావి । లోక్యవృ ॥ తంవ । ధూనిచ ॥ యేన । ॥

ఇది చాపుతాళం వహతి । మలయ । సమీ । రే- ॥ మదన । ముపని । దాయ । ॥ తిశ్ర ఏక, ఇలాగే అన్ని అష్టపదులు వాటి లయను చూపే ఛందస్సులలో రచించారు జయదేవకవి తరువాతి రచయితలు కూడా ఇదే ధోరణిలో నడిచారు 16, 17 శతాబ్దాల వరకూ సంగీత రచనలు యీ ధోరణిలోనే సాగాయి

భరతుని కాలం నాటికి సంగీతం, నాట్యం, సాహిత్యం యీ మూడు విభాగాలు నాటకానికి ఉపాంగాలు అంతేగాని ప్రత్యేకంగా పరిగణింపబడే కళలు కావు తరువాత నాటకంలో నాట్యం, సంగీతం వీటి పాలు తగ్గించవలసివచ్చింది

సంగీతం, నృత్యం యివి అధికంగా వుంటే సంభాషణలూ, దృశ్యాలూ వేగంగా సాగక, కథాగమనం కుంటుపడుతూ వుండడం గ్రహించారు అంతేకాదు, నాట్యం అర్థంచేసుకోగలిగేవారూ, తద్వారా కథాభాగాలు తెలుసుకొని ఆనందించేవారూ కూడా క్రమంగా తగ్గిపోయివుండాలి సంభాషణల ద్వారా హాస్య, వీర, రౌద్రాది రసాలు బాగా ఒప్పించగలగడం వల్ల ప్రజాబాహుళ్యానికి నాటకంలో సంగీతం, నృత్యం తగ్గడమే



http://www.maganti.org

మంచిదిగా కనిపించివుండాలి అందుచేత నాటకంలో అక్కడా అక్కడా నాట్యప్రదర్శనకు అవకాశాలు వుంచుతూ, క్రమంగా నాట్యాన్ని విడదీశారు నాట్యం అయితే విడిపోయింది సంగీతం మాత్రం శ్లోకాలు పద్యాలు పాడడం వల్ల అంతగా విడిపోలేదు తరువాత నాట్యంలో అనేక రీతులు ప్రబలి ప్రజా బాహుళ్యానికి అందుబాటులో గల భాషా సంగీతపు వరుసగల ఏల, జోల వెన్నెలపదం, తుమ్మెదపదం, జాజరపదం చిందు, ఒకటేమిటి అనేక విధాలుగా వెలిశాయి దీనితో బాటే సాహిత్యంకూడా రెండు భాగాలుగా అయి, జానపద సాహిత్యం, శిష్టసాంప్రదాయిక భాషాసాహిత్యం వేరుపడిపోయాయి

నాటకం ఒక బలమైన ప్రచారసాధనంగా వుండేది ఒకప్పుడు ఎంతటి క్లిష్టతర విషయాన్నయినా ప్రజలలో ఇట్టే ప్రచారం చేసేవారు నాటకం ద్వారా అంతకంటే సులభంగా ఆకర్షించగలిగినది సంగీతం అని తెలియగానే వీరగాథలు, వీర పదాలు పాడుతూ ప్రజల మన్ననలను పొందుతూ వూరూరా తిరిగేవారూ, మతవిషయిక గాథలను పాడుతూ మత ప్రచారం చేసేవారూ ఎక్కువయారు భక్తులు భగవంతుణ్ణి కీర్తిస్తూ కీర్తనలు పాడారు వారి శిష్యప్రశిష్యులు పాడుతూండడంవల్ల కీర్తనలు ప్రజాదరణ పొందినవి నిలిచేవి, లేనివి పోయేవి ఇల్లాటి రచనలు పాడే రీతులు ఒక నిర్ణీతమైన పద్ధతిలో అందరూ తెలుసుకొనడానికి వీలు కల్పిస్తూ కొందరు శాస్త్రకారులు స్వర లిపితో వ్రాశారు ఈ పద్ధతిని పాడే రచనల పేరిది, దీనిని వీరు ప్రారంభించేరు, దీనిని ఫలానా విధంగా గుర్తించడానికి యివి లక్షణాలు అని తెలియజేసేదే శాస్త్రం

శాస్త్రకారు లందరూ కూడా ఒక్క విషయం చాలా చక్కగా వ్రాశారు వారి కాలానికి గల వివిధ విషయాలను సంగ్రహించి అప్పటికి ప్రచారంలో వున్న వివిధ మతాలనూ క్రోడీకరించి, వారికి తోచిన విధంగా గ్రంథరూపంలో వెలువరిస్తున్నాం అని వ్రాశారు అంటే ఒక గ్రంథం సుమారు 16వ శతాబ్దంలో వ్రాయబడింది అని చరిత్రకారులు నిర్ణయించారనుకోండి ఆ కాలానికి ఒకటి రెండు వందల ఏండ్లుగా వాడుకలో గల విషయాలు అందులో మనకు లభ్యమవుతాయని నిశ్చయించుకోవచ్చు ఏ ప్రభువో వారిని పిలిచి, ఎవరికి తోచినట్లు వారు చెప్పలేనన్ని విధములుగా యీ విద్యను తమ యిష్టం వచ్చినట్లు మార్చేస్తున్నారనీ, అందుచేత యీ విశృంఖలతకు ఒక హద్దు ఏర్పరచి చక్కటి గ్రంథాన్ని వ్రాయమని కోరినట్లూ అందుచేతనే తామీ గ్రంథం వ్రాస్తున్నామనీ కొందరు పేర్కొన్నారు

పాల్కురికిసోమనాథుని కాలానికే సంగీతం, సాహిత్యం, నాట్యం, నాటకంలో నుండి వేరుపడి, యక్షులని పాటపాడే ఒక జాతివారి చేత యక్షుల గానాలు వచ్చేశాయి ఇంతే కాకుండా జానపదులు పాడుకొనేవి కూడా అనేక రీతులు పేర్కొన్నాడు ముచ్చటగా అలంకరించుకొని లయ బద్ధంగా అడుగులు వేస్తూ పాడుకొనేవి యెన్నో రకాలున్నాయి కొంచెం చదువుకున్నవారు, సంస్కారం గలవారు ఆనందించే నృత్యం సంగీతం, నాటకం సాహిత్యం ఇవి వేరు, జానపదులు పాడి, ఆడి ఆనందించేవి వేరు అయిపోయాయి ఆ కాలానికే వీరశైవులు మత ప్రచారానికి యీ విద్యలు చక్కని సాధనగా ఉపయోగించటం ప్రారంభించారు వీరికన్న ముందు బౌద్ధులు, జైనులు మొదలైనవారూ ఉపయోగించి వుండివుండవచ్చును గాని, వీరశైవుల కాలంనాటి అనేక ఘణుతులు ప్రచారంలో వున్నాయి

శైవం కాస్త వెనక్కు తగ్గి వైష్ణవం ప్రబలడం ఆరంభం కాగానే విష్ణుభక్తుల రచన లారంభం అయాయి వైష్ణవం మంచి ఉచ్ఛదశలో ఉండగా, అన్నమయ్య, పురందరదాసువంటి వాగ్గేయకారులు వెలసి వారి రచనలు తమ వెనుకటివారి రచనల వలె లుప్తం కాకుండా వుండడానికి ఏం చెయ్యాలి అని ఆలోచించారు ఎవరికి తోచినవిధంగా వారు ప్రచారంచేశారు, వారి రచనలను భద్రంచేసి తరువాతి తరాలవారికి అందజేశారు

అన్నమయ్య వారి రచనలు రాగిరేకుల మీద వ్రాయించి, పాడేవారికి, నేర్పేవారికి వృత్తులు, భత్యాలు ఏర్పరచి, మంచి కట్టుదిట్టమైన ప్రణాళికలు వేసి ప్రచారంలో వుంచేందుకు దేశంలో గల వైష్ణవ ఆలయాలన్నిటిలోను పాడేలాగ చేయడానికి ప్రయత్నాలుచేశారు.


పురందరదాసులు గీత ప్రబంధాలను విద్యార్థులకు నేర్పించే పద్ధతిని స్వరబద్ధంగాచేసి ప్రచారంలోకి తెచ్చారు ఇప్పటికీ మన పిల్లలకు నేర్పే శిక్షాక్రమ పద్ధతి పురందరదాసులు ఏర్పరచినదేనని పెద్ద లంటారు అన్నమయ్యవారి రచనలు

అసంఖ్యాకములుగా వున్నాయి గాని, పాడే ఫణతులు తెలియ రావడంలేదు సంగీతం స్వర లిపితో వ్రాసివుంచే అలవాటు ఆరంభమయి ఒక మూడు వందల ఏండ్లయి వుండవచ్చు ఎంచేత నంటే వేదం లాగ గురుముఖతా నేర్చుకోవలసిన విద్య గాని, స్వరాలు చూసి నేర్చుకోవడం సాధ్యంకాదని అభిప్రాయపడ్డారు ఆ రోజుల్లో మనవాళ్లు అయితే ఆ విషయం కొంత నిజమేమో వినికివల్ల గాని అనేక మెలకువలు పట్టుపడవు మన స్వర లిపి పుట్టిన కాలంనాటికి గల సంగీతానికి ఆ లిపి సరిపోతుంది తరువాత సంగీతం అనేక పరిణామాలు పొందుతూ వచ్చింది కాని స్వర లిపిని సరిచేసే ప్రయత్నాలు ఎవరూ చెయ్యలేదు కారణం, లిపిబద్ధంగా సంగీతం వుంచాలన్న దృష్టి కలగడమే చాలా ఆలస్యం అయింది అది కలిగేసరికి చాలా క్లిష్టమయిన గమకవరికాదులు వాడుకలో బలపడిపోయి, గుర్తులు, పరిభాషలు ఏర్పరచుకోవడం అసాధ్యమని వదిలేయాల్సివచ్చింది

వాద్యాలలో వీణ చాలా పురాతనమైనది రకరకములయిన తంత్రీ వాద్యాల క్రింద వీణలనే వాడుకునేవారు ఇప్పుడు మనం చూస్తున్న వీణలు నాలుగైదు రకాలు మహానాటక వీణ లేక గోటువాద్యం (బీన్ అనే ఉత్తరాదివారు వాడే విచిత్ర వీణ కూడా ఇదే) చేతలో కాస్తంత తేడా వున్నా వాయించే పద్ధతి ఒకటే. ఇప్పటి స్వరమండలి కూడా ఒకప్పటి వీణే అప్పుడు గమకాలు పలికించే అవకాశం వుండేదికాదు సోమేశ్వర పండితుడు (రాగవిబోధకారుడు) వీణకి మెట్లు అమర్చి గమకాలు పలికించే అవకాశం కలిగించాడు అప్పటి నుంచీ సంగీతంలో, ముఖ్యంగా దాక్షిణాత్యుల సంగీతంలో మార్పు రావడం మొదలయింది అంటే కంపితము, జారు, రవ, గమకజంట, మొదలైన గమకాలకు స్థిరమైన స్వరూపాలు వీణలో కనబడడం వల్ల వీణను ముఖ్యమైన వాద్యంగా తీసుకున్నారు ఆ వాద్యానుగుణంగానే పాడడం ఆరంభించారు వీణలో వచ్చిన యీ మార్పులతోటే సంగీతం మారింది అటు ఉత్తరాదివారి సంగీతం పర్షియన్‌వారి ప్రభావంవల్ల మారింది ఈ రెండు మార్పులూ ఇంచుమించు ఒకేసారి ప్రారంభమయి వుండవచ్చు కూడా

ఈ విధంగా సంగీతంలో మార్పులు వచ్చిన తదుపరి, రాగాలకు స్వరూపాలు ఏర్పడ్డాయి ఈ రాగాలనే క్షేత్రజ్ఞుల వారు తమ రచనలలో పాడి, వాటి స్వరూపాలను ఇంకా స్పష్టంగాను, అందంగాను, తీర్చిదిద్దారు తరువాతి వాగ్గేయకారులందరూ వారి అడుగుజాడల్లోనే నడిచారు సంగీతసాగరం లోని యీ రాగాలను అనంతంగా సృష్టించడానికి అవకాశం వుందని గుర్తించిన త్యాగరాజస్వామి అనేక కొత్త రాగాలను సృష్టించి వాటిలో కీర్తనలను పాడారు ముత్తుస్వామి దీక్షితుల వారు మాత్రం సాంప్రదాయసిద్ధంగా వస్తూన్న రాగాలలోనే రచనలు సాగించారు అంతేకాకుండా పుణ్యక్షేత్రాలు దర్శిస్తూ కాశీ, ప్రయాగ క్షేత్రాలలో వుంటూన్నప్పుడు అక్కడి సంగీతాన్ని కూడా అభ్యసించి, ఔత్తరాహిక సంగీతంలోని బృందావనిసారంగ, మాహురి మొదలైన రాగాల్లో కూడా రచనలు చేశారు

హిందూస్తానీ సంగీతంలోని ధృపద్, ధమ్మార్, హోరి మొదలైన రచనలు కూడా సాహిత్యం, లయ ప్రధానంగా వుండి మన పురాతన రచనలకు దగ్గరగా వుంటాయి హిందూస్తానీ రాగాలలో రెండు గాంధారాలు, రెండు ధైవతాలు, నిషాదాలు ప్రయోగించి సంచారాలు చెయ్యడం సాంప్రదాయి విరుద్ధం కాదుగనుక, రాగాలలో ప్రత్యేకతలు తక్కువ అయి. కొద్దిపాటి రాగాలు మాత్రమే వాడుకలో వుండడం సంభవించింది అందుచేతే కాబోలు ఈ కొద్దిపాటి రాగాలనే వాది సంవాది తేడాలు చేసి, పూర్వాంగ, ఉత్తరాంగ ప్రాధాన్యతలను చూపి, రేండేసి రాగాలను కలుపుతూ, కొన్ని దాక్షిణాత్య, రాగాలను తీసికొని హిందూస్తానీ బాణీలోనికి మార్చి. కొంత వైవిధ్యాన్ని సాధిస్తున్నారు ఔత్తరాహిక విద్వాంసులు. ఇవి మన సంగీతసాగరంలోని కొన్ని అలలు.





http://www.maganti.org

Source: A.P. Press Academy Website, Natya Kala - 1963

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan